క్లుప్తంగా

నవోదయకు విద్యార్థి ఎంపిక



మాచర్ల రూరల్: పట్టుదలతో చదివితే అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయనటానికి విద్యార్థి షేక్ రెహనానే ఆదర్శమని, నవోదయ విద్యాసంస్థలో ప్రవేశం పొందటం అభినందనీయమని విద్యా సంస్థ చైర్మన్ కొమ్మారెడ్డి చలమారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని స్కూల్‌లో షేక్ రెహనాను అభినందించారు. అనంతరం విద్యార్థికి కేక్ తినిపించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్ దరియావాలి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, పల్నాడు జూనియర్ కాలేజి కరస్పాండెంట్ షేక్ నాగూర్‌వలి, ఉపాధ్యాయులు రాజేశ్వరి, శ్యామల, శ్రీనివాసరావు, అనుపమ, కవిత తదితరులున్నారు.

నేడు ఎంపీపీ ఎన్నిక

అచ్చంపేట: స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో అచ్చంపేట మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక జరుగుతుందని, గురువారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులంతా హాజరుకావలసినదిగా ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు బుధవార ఒక ప్రకటనలో కోరారు.

నేడు రంజాన్ తోఫా పంపిణీ

సత్తెనపల్లి: రంజాన్ మాసం పురస్కరించుకొని ముస్లిం పేదలకు గురువారం ఉదయం 9:30 గంటలకు పట్టణంలోని 27వ వార్డు ముస్లింపేట పీర్లచావిడి వద్ద గల మదర్సాలో ముస్లిం యూత్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ జరుగుతుందని ముస్లిం యూత్ నాయకులు బుధవారం తెలిపారు. రంజాన్ తోఫాకి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థినుల కృషి అనుభవ కార్యక్రమం




చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని డాట్ ట్రైనింగ్ సెంటర్ నరసరావుపేట ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినుల గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమం చాగంటివారిపాలెం గ్రామంలో బుధవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ కళాశాల విద్యార్థినులు లింగాకర్షక బుట్టలు, వరిలో కాండం తొలుచు పురుగు, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. పంటలపై వచ్చే వివిధ రకాల చీడపీడల యాజమాన్యం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ శైలజ, వ్యవసాయ కళాశాల విద్యార్థినులు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వ్యక్తి ఆత్మహత్య

సత్తెనపల్లి: చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. అచ్చంపేట మండలం కొండూరుకి చెందిన ఆల స్వామి(44) భార్య వెంకాయమ్మతో మనస్పర్థల కారణంగా మూడు రోజుల క్రితం పొట్ట, తదితర ప్రాంతాల్లో కత్తితో కోసుకొని గాయాలపాలై చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చేరాడు. ఈ క్రమంలో పురుషుల వార్డులో చికిత్స పొందుతున్న స్వామి వార్డులోని బాత్రూమ్ కిటికీకి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మృతుడికి భార్య వెంకాయమ్మ, ఇరువురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు యలమంద రాజు ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి పట్టణ ఎస్ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు స్వామి మృతదేహానికి ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు.

రుణమేళాకు 60 మంది హాజరు



నాదెండ్ల: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 2024–25 ఏడాదికి గాను బీసీ, ఈబీసీ, కాపు, జనరిక్ ఫార్మసీ రుణ అర్హత మేళా నిర్వహించారు. ఆన్‌లైన్‌లో 130 మంది దరఖాస్తు చేసుకోగా, 60 మంది మాత్రమే ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరికి రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ ఎంచుకున్న యూనిట్లకు రుణ సదుపాయం కల్పించనున్నారు. యూనిట్ విలువలో 50 శాతం సబ్సిడీ ఉంటుందని ఎంపీడీవో స్వరూపరాణి చెప్పారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా ఎంపీడీవో స్వరూపరాణి, ఈవోపీఆర్డీ నిర్మలా లక్ష్మీ కుమారి, కనపర్రు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, నాదెండ్ల బ్యాంక్ ఆఫ్ బరోడా, గణపవరం ఎస్‌బీఐ, సాతులూరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ప్రతినిధులు హాజరయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు ఆయా బ్యాంకుల నుంచి రుణాలను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఎంపీపీ తలతోటి రాణి పాల్గొన్నారు.

రక్షణ లేని ఈత.. తప్పదు గుండెకోత

- పిల్లల కదలికలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి
- ప్రమాదకరంగా క్వారీ గుంతలు, చెరువులు, కాలువలు
- సరదా కోసం జలవనరుల వద్దకు వెళ్తే ప్రాణాలకే ముప్పు



నడికుడి రైల్వేస్టేషన్ వద్ద ప్రమాదకరంగా క్వారీ గుంతల్లో నిలిచిన నీరు

దాచేపల్లి: సరదాల మాటున ప్రాణాలకు పెను ప్రమాదం పొంచి ఉంది. ఏముందిలే అని తేలికగా తీసుకుంటే ప్రాణాలు పోయే పరిస్థితులు ఉంటాయి. వేసవికాలం కావటం వలన ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు పిల్లలు చెరువులు, కాలువలు, క్వారీ గుంతలు, వాగుల్లో ఈతకు వెళుతుంటారు. సరదా కోసం చేసే ఈ ప్రయత్నంలో ప్రాణాలు కోల్పోయిన వారు ఎంతోమంది ఉన్నారు. ప్రస్తుతం ఒంటిపూట బడులు నిర్వహిస్తున్న దృష్ట్యా పిల్లల కదలికలపై తల్లిదండ్రులు ప్రత్యేకంగా దృష్టి సారించాలి. కనీస రక్షణ చర్యలు లేకుండా ఈత కొట్టకూడదు. కన్నవారు అశ్రద్ధతో పిల్లలను వదిలిస్తే చివరకు కడుపుకోత మిగులుతుంది.

ఇంటి వద్దే ఉండేలా చూడాలి

ఎండ తీవ్రతలు అధికంగా ఉండటంతో ప్రభుత్వం ఒంటిపూట బడులు నిర్వహిస్తోంది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాల నుంచి రాగానే ఎక్కువగా పిల్లలు ఆటలకు ప్రాధాన్యత ఇస్తుంటారు. ఎండ తీవ్రత నుంచి ఉపశమనానికి తోడు సరదా కోసం ఈతకు ప్రాధాన్యత ఇస్తారు. కనీస రక్షణ చర్యలు లేని చోట ఈత కొడుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఆటలు, ఈత శారీరక వ్యాయామంగా మంచిదే అయినా.. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం పొంచి ఉంది. మధ్యాహ్నం పాఠశాల ముగిసిన తరువాత పిల్లలను ఇంటికే పరిమితం అయ్యేలా తల్లిదండ్రులు చూడాలి. ప్రయాణాల సమయంలో పిల్లలను ద్విచక్రవాహనాలపై పగటి పూటబయటకు తీసుకెళ్లటం మంచిది కాదు. మధ్యాహ్నం పిల్లలు బయట తిరిగితే వడదెబ్బ సోకే ప్రమాదం ఉంది. ఇంట్లోనే నీడపట్టున ఆడుకునేలా ప్రోత్సహించాలి. వీలైనంత ఎక్కువ సమయం వారితో గడిపేందుకు తల్లిదండ్రులు ఏర్పాట్లు చేసుకోవాలి. హోంవర్క్ మధ్యాహ్న సమయంలో చేసుకునేలా చూసి, సాయంత్రం ఆడుకునేందుకు అవకాశం కల్పించాలి.

జాగ్రత్తలు అవసరం

జనవనరుల వద్ద కనీస రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో అవి ప్రమాదకరంగా ఉన్నాయి. దాచేపల్లి మండల పరిధిలో క్వారీ గుంతలు ఎక్కువ ప్రమాదకరంగా ఉన్నాయి. క్వారీ నుంచి రాయి భారీగా వెలికితీయటం వలన 30 అడుగులకు పైగా గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతల్లో నీరు చేరింది. ఇక్కడ ఈతకు వెళ్లి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. నివాసాల మధ్యలో వాగులు, కాలువలు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. దాచేపల్లిలోని నాగులేరు గృహాల మధ్య ఉంది. వేసవిలో నాగులేరులో ఎక్కువమంది ఈత కొడుతున్నారు. ప్రమాదవశాత్తు ప్రాణ నష్టం గతంలోనూ జరిగింది. పంట కాలువలు, వాగులు కూడా ఈ తరహా ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.



రక్షణ చర్యలు చేపట్టని నాగులేరు

ఎండతో పిల్లలకు ప్రమాదం



ఎండ తీవ్రత పిల్లలపై చాలా ప్రభావం చూపుతుంది. ఎండలో పిల్లలు తిరగటం వలన వడదెబ్బ తగులుతుంది. చర్మం పొడిబారటం, చర్మ సంబంధిత వ్యాధులు సోకుతాయి. త్వరగా నీరసపడతారు. తలనొప్పి, కళ్లు తిరగటం కనిపిస్తాయి. అందరూ ఒకే చోట ఈత కొట్టటం వలన నీరు కలుషితమై వ్యాధులు వస్తాయి. ఎండాకాలం ఎక్కువగా ద్రవ పదార్థాలు, సీజనల్ పండ్లు తీసుకోవాలి.

– డాక్టర్ మాస్కాని సాయికర్ణ కుమార్,
పిల్లల వైద్య నిపుణులు, గురజాల ప్రభుత్వ వైద్యశాల

రెవెన్యూ శాఖపై ఫిర్యాదుల వెల్లువ

- ఐవీఆర్ఎస్ కాల్‌లో ఫిర్యాదు చేసిన ప్రజలు
- 28 మంది వీఆర్వోలు, 12 మంది గ్రామ సర్వేయర్లుకు షోకాజ్ నోటీసులు

గురజాల: డివిజన్‌లో రెవెన్యూ శాఖ అవినీతి ఊబిలో కూరుకుపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెవెన్యూ విభాగంలో గ్రామ రెవెన్యూ అధికారి మొదలు ఆర్ఐ, డిప్యూటీ తహసీల్దార్‌లు, తహసీల్దార్‌లు పైసా లేనిదే పనిచేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డివిజన్ పరిధిలోని గురజాల, దాచేపల్లి, మాచర్ల, పిడుగురాళ్ల, రెంటచింతల, కారంపూడి, దుర్గి, వెల్దుర్తి, రెంటచింతల, మాచవరం మండలాల్లో పరిస్థితి దారుణంగా ఉందని ప్రభుత్వ సర్వేలే స్పష్టం చేస్తున్నాయి. ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజలకు అందించిన సేవల పట్ల ఏ విధంగా ఫీలవుతున్నారు అనే సమాచారాన్ని తెలుసుకునేందుకు కాల్స్ చేయగా అధికారులపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు , సర్వే కోసం కోరితే రైతులను ఇబ్బందులు గురిచేసినట్లు కాల్స్‌లో 28 మంది వీఆర్వోలకు, 12 మంది గ్రామ సర్వేయర్లపై ఫిర్యాదులు వచ్చాయి. నోటీసులు అందుకున్న వీఆర్వో సంఖ్యను మండలాలవారీగా చూస్తే గురజాల 6, దుర్గి 2, దాచేపల్లి 5, కారంపూడి 2, మాచర్ల 4, పిడుగురాళ్ల 5, మాచవరం 4గా ఉంది. దీంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆ మేరకు రెవెన్యూ డివిజనల్ అధికారి నోటీసులు జారీ చేశారు. దీనిపై గురజాల ఆర్డీవో వి మురళీకృష్ణ మాట్లాడుతూ.. ఫిర్యాదులు వచ్చిన వాటిపై విచారణ జరుపుతున్నామని తెలిపారు.

నేడు కారెంపూడి వైస్ ఎంపీపీ ఎన్నిక

వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలకు రక్షణ కల్పించాలని హైకోర్టు ఆదేశాలు

కారెంపూడి: కారెంపూడి వైస్ ఎంపీపీ ఎన్నిక గురువారం ఉదయం 11 గంటలకు జరగనుంది. మండల పరిషత్తులో మొత్తం 14 మంది ఎంపీటీసీలు వైఎస్సార్‌సీపీకి చెందిన వారే. గత జనరల్ ఎలక్షన్స్ సమయంలో పేటసన్నెగండ్ల 1 ఎంపీటీసీ గాడిపర్తి రమాదేవి టీడీపీలో చేరారు. దీంతో వైఎస్సార్‌సీపీకి 13 మంది, టీడీపీకి ఒక ఎంపీటీసీ ఉన్నారు. వైస్ ఎంపీపీగా కొనసాగిన వేపకంపల్లి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ కోకా అక్కమ్మ మృతి చెందడంతో వైస్ ఎంపీపీ పదవికి ఎన్నికల కమిషన్ ఎన్నిక నిర్వహిస్తోంది. టీడీపీ తమ ఆధిపత్యాన్ని చాటాలనే యత్నాల కారణంగా మండల రాజకీయాలు వేడెక్కాయి. ఒకటి రెండు చోట్ల దౌర్జన్యకర ఘటనలు చోటుచేసుకున్నాయి.దీంతో మిరియాల వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ కొమ్మిరెడ్డి విజయ ఎన్నికలలో పాల్గొనేందుకు తమకు రక్షణ కల్పించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలకు పూర్తి రక్షణ కల్పించాలని, వారిని ప్రత్యేక వాహనంలో మండల పరిషత్తు కార్యాలయానికి చేర్చే బాధ్యతను పోలీసులకు అప్పగిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అలాగే ఎన్నిక సీసీ కెమెరాల నిఘాలో జరగాలని, వీడియో తీయించాలని ఎంపీటీసీలకు పోలీస్ ఎస్కార్ట్ ఇవ్వాలని ఆదేశాలిచ్చింది. విజయ వైఎస్సార్‌సీపీ వైస్ ఎంపీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. అలాగే 8 గ్రామాలకు ఉప సర్పంచ్‌ల ఎన్నిక కూడా నేడు గురువారమే జరగనుండడంతో ఒక్కసారిగా ఉప ఎన్నికల సందడి గ్రామాలలో నెలకొంది. రాజకీయాలు కూడా వేడెక్కాయి. టీడీపీ సత్తా చూపాలని యత్నాలు చేస్తుంటే, వైఎస్సార్‌సీపీ తమ స్థానాలను పదిలం చేసుకోవడానికి యత్నాలు చేస్తోంది. ఇదిలా ఉంటే ఉప ఎన్నికలున్న చోట్ల 30 పోలీస్ యాక్ట్ అమలుతోపాటు 144 సెక్షన్‌ను విధిస్తూ అధికారులు ఉత్తర్వులిచ్చారు. పోలీస్ శాఖ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటోంది. అలాగే ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రుణ అర్హత మేళాకు 140 దరఖాస్తులు

రెంటచింతల: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన క్రెడిట్ క్యాంప్ (రుణ అర్హత మేళా)కు వివిధ బ్యాంక్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో 140 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ కె. సరోజినిదేవి తెలిపారు. 2024–25కు సంబంధించి ఎంఎస్ఎంఈ కింద స్వయం ఉపాధిలో భాగంగా బీసీ, ఈబీసీ, కాపు, జనరిక్ ఫార్మసీ లబ్ధిదారులకు ఏర్పాటు చేసిన ఈ క్రెడిట్ క్యాంపులో మండల పరిధిలోని వివిధ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్లు(సెలక్షన్ కమిటీ సభ్యులు), గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొని అభ్యర్థుల వివరాలు పరిశీలించారన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ చినుకూరి శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ గాదె శ్రీనివాసరావు, బ్యాంక్ మేనేజర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



రెంటచింతల: రుణమేళాలో పాల్గొన్న అధికారులు

162 మంది హాజరు

మాచవరం: సబ్సిడీ రుణాలు అందించేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన క్రెడిట్ క్యాంపునకు 162 మంది దరఖాస్తుదారులు హాజరయినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంగళరావు తెలిపారు. మండల స్థాయిలో 68 యూనిట్లకుగాను దరఖాస్తుదారులు వచ్చారని పేర్కొన్నారు.



మాచవరంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

నేడు ఈ ప్రాంతాల్లో...

వెల్దుర్తి: వివిధ కార్పొరేషన్‌ల ద్వారా స్వయం ఉపాధిలో భాగంగా బీసీ, ఈబీసీ, కాపు, జనరిక్ ఫార్మసీ లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు గురువారం రుణమేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి. ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ బ్యాంకు అధికారులు, సెలక్షన్ కమిటీ సభ్యులు దీనిలో పాల్గొంటారని పేర్కొన్నారు.

పిడుగురాళ్ల: పట్టణంలోని గాంధీనగర్ సచివాలయంలో గురువారం రుణ అర్హత మేళా నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ... ఈ మేళా ఉదయం 10.30 గంటలకు మొదలవుతుందని తెలిపారు.

దాచేపల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 28న క్రెడిట్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పప్పుల రత్నం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు క్యాంప్‌లో పాల్గొనాలని ఆయన కోరారు.

ఇక నుంచి వాటర్‌బెల్.. మూడుసార్లు!

నూజెండ్ల: వేసవి ఉష్ణోగ్రతలు పెరగటం వలన పాఠశాలల్లోని విద్యార్థులకు రోజుకు మూడు సార్లు వాటర్ బెల్ పాటించాలని ఎంఈవో రవిచంద్ర బుధవారం తెలిపారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు ఉదయం 10, 11, 12 గంటలలకు అన్ని పాఠశాలలో విధిగా వాటల్‌బెల్ సమయాలు పాటించాలన్నారు. తాగునీరు అందుబాటులో ఉండేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలన్నారు. తాజాగా విడుదల అయిన నవోదయ పరీక్షా ఫలితాల్లో మండలంలో ముగ్గురు విద్యార్థులు ఎంపిక అయినట్లు తెలిపారు. గొల్లపాలెం, కంభంపాడు, రవ్వారం గ్రామాల్లోని విద్యార్థులు అక్షయ్, జస్మిత్, ప్రైసిలను అభినందించారు.

నవోదయకు గణపవరం విద్యార్థి

నాదెండ్ల: జవహర్ నవోదయ మద్దిరాల క్యాంపస్‌లో ఆరో తరగతి ప్రవేశ పరీక్షలో గణపవరం విద్యార్థి సత్తా చాటి సీటు సాధించాడు. గణపవరం అంబేద్కర్ కాలనీ ఎంపీపీఎస్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థి కొండెపాగ అభిరానందన్ ఇటీవల జరిగిన జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షకు హాజరయ్యాడు. ప్రకటించిన ఫలితాల్లో మంచి మార్కులు సాధించి సీటు దక్కించుకున్నాడు. విద్యార్థి తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. విద్యార్థిని పలువురు అభినందించారు.

ఏఎంసీ మాజీ చైర్మన్ మృతి పార్టీకి తీరని లోటు

మాజీ మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కట్టా సాంబయ్య మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటును మిగిల్చిందని ఆ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి మండలం నందిగామ, గుడిపూడి గ్రామాల్లో కట్టా సాంబయ్య దశదిన కర్మ కార్యక్రమం బుధవారం నిర్వహించగా నందిగామలో అంబటి రాంబాబు, గుడిపూడిలో సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి పాల్గొని సాంబయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు, డాక్టర్ సుధీర్ భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ సత్తెనపల్లి మండలంలోనే కాక నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతంలో కట్టా సాంబయ్య క్రియాశీలకంగా పని చేశారని కొనియాడారు.



కట్టా సాంబయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు, నాయకులు

ముఖ్యంగా గుడిపూడి గ్రామంలో సాంబయ్య లేని లోటు పూడ్చేది కాదన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు కట్టా సాంబయ్య పార్టీకి చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, నాయకులు పెండెం బాబురావు, షేక్ నాగూర్ మీరాన్, రాయపాటి పురుషోత్తమరావు, కళ్ళం విజయభాస్కర్‌రెడ్డి, భవనం రాఘవరెడ్డి, అచ్యుత శివప్రసాద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ట్రక్ ఆటో ఢీకొని మహిళకు గాయాలు

నాదెండ్ల: చిలకలూరిపేట–నరసరావుపేట రహదారిపై ఫార్‌కార్నర్స్ వద్ద టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్‌వాహనాన్ని ట్రక్ ఆటో ఢీకొన్న ఘటనలో మహిళ గాయాలపాలైంది. పోలీసుల కథనం ప్రకారం.. కావూరు–లింగంగుంట్ల గ్రామానికి చెందిన షేక్ సైదాబీ మంగళవారం మధ్యాహ్నం సరుకుల కొనుగోలుకు మోపెడ్‌పై చిలకలూరిపేటకు బయలు దేరింది. ఫార్‌కార్నర్స్ వద్దకు రాగానే వెనుక నుంచి మహీంద్రా ట్రక్ ఆటో ఢీకొంది. గాయపడిన క్షతగాత్రురాలు చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు.

వీఆర్‌ఏల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బందగీ సాహెబ్

సత్తెనపల్లి: గ్రామ రెవెన్యూ సహాయకుల(వీఆర్ఏల) రాష్ట్ర సదస్సు ఏప్రిల్ 5న విజయవాడలో జరగనుందని, ఈ సదస్సును జయప్రదం చేయాలని వీఆర్‌ఏల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బందగీ సాహెబ్ పిలుపునిచ్చారు. సత్తెనపల్లిలో వీఆర్‌ఏల సంఘం సత్తెనపల్లి మండల అధ్యక్షుడు రవి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావాలంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి సిద్ధం కావాలని, వీఆర్‌ఏలకు గత 8 సంవత్సరాలుగా జీతాలు పెంచలేదని, ప్రమోషన్లు ఇవ్వలేదని, రాష్ట్రంలో మంత్రులు, ముఖ్యమంత్రులు మారుతున్నారు కానీ వీఆర్‌ఏల కష్టాలు, సమస్యలు తీర్చేవారు కనిపించడం లేదన్నారు. పక్కన ఉన్న తెలంగాణ రాష్ట్రంలో వీఆర్‌ఏలకు పే స్కేలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు. మన రాష్ట్రంలో కూడా వీఆర్‌ఏలకు పే స్కేలు జీతాలు ఇవ్వాలని మంత్రులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా కనికరించడం లేదన్నారు. అటెండర్, నైట్ వాచ్‌మెన్, వీఆర్వో, రికార్డ్ అసిస్టెంట్, ఖాళీ పోస్టులు భర్తీ చేయడం లేదన్నారు. కానీ దొడ్డిదారిన నైట్ వాచ్‌మెన్ డ్యూటీలు మాత్రం బలవంతంగా చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో వీఆర్‌ఏల ఊసే లేదన్నారు. ఏప్రిల్ 5న విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సులో ప్రతి వీఆర్‌ఏ పాల్గొని జయప్రదం చేయాలని, వీఆర్‌ఏలు అందరూ ఐకమత్యంగా పోరాడదామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. సమావేశంలో సత్తెనపల్లి మండల, గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న షేక్ బందగీ సాహెబ్, వీఆర్‌ఏలు

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

నార్నెపాడు(ముప్పాళ్ళ): రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని మండల వ్యవసాయ అధికారి ఎం.అరుణ చెప్పారు. మండలంలోని నార్నెపాడు, దమ్మాలపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోన్ నెంబర్, సర్వే నెంబర్‌తో గ్రామ వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించాలన్నారు. మార్చి 31 వరకు మాత్రమే సాగునీరు విడుదలవుతుందని, రైతులందరూ ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకొని పంటలను కాపాడుకోవాలన్నారు. పంట ఉత్పత్తులను ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకోవాలని సూచించారు. ప్రభుత్వం క్వింటా మినుములకు రూ.7,400, మొక్కజొన్న రూ.2,225, కంది రూ.7,550 చొప్పున కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు అమ్ముకోవాలంటే రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. ఏఈఓ ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.



నార్నెపాడులో రైతులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తున్న ఏఓ అరుణ

పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో తనిఖీ

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని పదో తరగతి పరీక్ష జరిగిన నాలుగు కేంద్రాలలో బుధవారం ఎంఈఓ–2 వై. శివనాగేశ్వరావు తదితరులు తనిఖీలు చేశారు. మొత్తం 806 మందికిగాను 802 మంది హాజరు అయ్యారని గుర్తించారు. ఎండల కారణంగా ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఆరోగ్య కార్యకర్తలు మందులతో అందుబాటులో ఉండేలా ఆదేశాలిచ్చారు.

మే 11న కృత్రిమ చేతులు పంపిణీ

పిడుగురాళ్ల : రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల మైస్ సిటీ, రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి సంయుక్త ఆధ్వర్యంలో మే నెల 11వ తేదీన ఉచితంగా రోబోటిక్ కృత్రిమ చేతుల పంపిణీ శిబిరం నిర్వహించనున్నారు. ఈ రోబోటిక్ కృత్రిమ చేతుల పంపిణీ జానపాడురోడ్డులోని శ్రీ వాసవీ అమ్మవారి దేవస్థానం కల్యాణ మడపంలో నిర్వహిస్తామన్నారు. వివరాలకు ఫోను నెంబర్లు 98853 46845, 98484 20549లలో సంప్రదించాలని సూచించారు.

ఇంటి పన్నుపై వడ్డీ తగ్గింపు

దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు 50 శాతం వడ్డీ రాయితీతో చెల్లించే అవకాశం కల్పించినట్లు కమిషనర్ వైవీ అప్పారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నుల బకాయిలపై ఈ మినహాయింపును ప్రభుత్వం ఇచ్చిందని చెప్పారు. ఈ నెల 31వ తేదీలోపు బకాయిలు చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని ఆయన కోరారు.

ఏప్రిల్ 1 నుంచి గ్రామాలలో పంచప్రాధాన్యాలు

అచ్చంపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు ఉపాధి హామీ పథకం ద్వారా పంచ ప్రాధాన్యాల పనులు చేపట్టనున్నట్లు ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- పశువులకు నీటి వసతి ఉన్న ప్రదేశం, పశువుల రాకపోకలకు, పశువులు మందగా చేరుటకు అనువైన ప్రదేశంలో నీటి తొట్లెలను నిర్మించవలసి ఉందన్నారు.
- లక్ష్యం మేరకు సేద్యపు నీటి కుంటలు, ఇన్‌లెట్, అవుట్‌లెట్, సిల్ట్ ట్రాప్ పనులు పూర్తి చేయవలసి ఉందన్నారు.
- పంట కాలువ, ఫీడర్, సప్లై చానల్ పనులకు సంబంధించి అవసరాన్ని బట్టి పంట కాలువలు పునరుద్ధరించవలసి ఉందన్నారు.
- విస్తృత స్థాయిలో కూలీలకు పని కల్పించడం కొరకు చెరువు కుంటలను వాటి అసలు సామర్థ్యం మేరకు పునరుద్ధరించడం, మట్టి గుంతలను చెరువు కట్ట అడుగు నుంచి కట్ట ఎత్తు కంటే పదిరెట్లు దూరం తరువాత తవ్వవలసి ఉందని ఎంపీడీవో చెప్పారు.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రకటించిన సగటు దినసరి వేతనం రూ.300 పొందడానికి ఆయా పనులకు సంబంధించిన కచ్చితమైన మార్కవుట్ ఇచ్చి పని చేయునట్లు మేట్లు శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి శుక్రవారం రోజుగార్ దివస్ సందర్భంగా కూలీలకు ఆయా పనులకు సంబంధించిన మార్కెట్, వేతనంపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

పారిశుద్ధ్య నిర్వహణపై శిక్షణ వాయిదా

నాదెండ్ల: నాదెండ్ల ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రంలో మూడో రోజు బుధవారం పారిశుద్ధ్య నిర్వహణపై జరగవలసిన శిక్షణ కార్యక్రమం వాయిదా పడింది. మండల పరిషత్ కార్యాలయంలో రుణమేళా, గురువారం పలు ప్రాంతాల్లో ఉప సర్పంచ్ ఎన్నిక నేపథ్యంలో శిక్షణ వాయిదా పడినట్లు ఈవోపీఆర్డీ నిర్మలా లక్ష్మీ కుమారి తెలిపారు. గురువారం నుంచి రెండు రోజుల పాటూ యడ్లపాడు మండల అధికారులకు జరగాల్సిన శిక్షణ కూడా వాయిదా వేసినట్లు తెలిపారు.